పాపాయి కోసం..

- గర్భం దాల్చాలనుకునే వారి నిద్రకు ఇదే సరైన సమయం
- లేటు నిద్రతో సంతాన సమస్యలు



న్యూఢిల్లీ/(స్పెషల్ టాస్క్ బ్యూరో), జూలై 27: మహిళల గర్భధారణకు పురుషుల శుక్ర కణాల సంఖ్య, వాటి కదలిక, కలిసే సమయం, అండం విడుదల తేదీ, హార్మోన్ల ప్రభావం.. ఇలా ప్రతీ విషయం కీలక పాత్ర పోషిస్తాయని తెలిసిందే. అయితే, మహిళల గర్భ ధారణకు వాళ్లు నిద్రపోయే సమయం కూడా కీలక పాత్ర చూపిస్తుందని తెలుసా? చైనాలోని హునన్‌లో ఉన్న సెకండ్ జియాంగ్యా హాస్పిటల్ శాస్త్రవేత్తలు చేసిన తాజా అధ్యయనం ఈ విషయాన్నే వెల్లడించింది.

అప్పుడు నిద్రపోతేనే మంచిది

గర్భం దాల్చాలనుకునే మహిళలు రాత్రి 10.45 గంటలలోగా నిద్రపోవాలని చైనా శాస్త్రవేత్తలు తెలిపారు. 2015-2020 మధ్య దాదాపు 4,000 మంది మహిళల దినచర్యను విశ్లేషించినప్పుడు.. రాత్రి 10.45 గంటల తర్వాత నిద్రపోయేవారిలో 22 శాతం మందికి సంతానోత్పత్తి సమస్యలు తలెత్తినట్టు గుర్తించారు. రాత్రి 10.45 గంటల తర్వాత నిద్రపోయే మహిళలు గర్భం దాల్చే అవకాశాలు ఐదో వంతుకుపైగా తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు చెప్పారు. 'ఫ్రాంటియర్స్ ఇన్ ఎండోక్రినాలజీ' అనే జర్నల్‌లో ఈ అధ్యయన నివేదిక ప్రచురితమైంది.

కారణాలు ఏమిటంటే?

ఆలస్యంగా నిద్రకు ఉపక్రమించడం వల్ల శరీరంలోని అంతర్గత జీవ గడియారానికి విఘాతం కలుగుతుందని పరిశోధకులు చెప్తున్నారు. హార్మోనల్ చైన్ రియాక్షన్ వస్తుందని, ఫలితంగా మహిళ విడుదల చేసే అండం, పురుషుడు విడుదల చేసే శుక్ర కణాలు ఫలదీకరణమయ్యే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. హార్మోనల్ మెకానిజమ్స్ అత్యంత కట్టుదిట్టంగా ప్రత్యుత్పత్తి వ్యవస్థను నియంత్రిస్తాయని పరిశోధకులు తెలిపారు. ఈ మెకానిజానికి ఏర్పడే అంతరాయం సంతాన లేమికి దారి తీస్తుందని వివరించారు. దంపతులు ఓ కుటుంబాన్ని ఏర్పరచుకోవాలంటే కచ్చితంగా సకాలంలో నిద్రపోవడం తప్పనిసరి అని చెప్పారు.

హెచ్చుతగ్గుల నిద్రతో డయాబెటిస్ ముప్పు

అతి నిద్రా ప్రమాదమేనంటున్న యూకే పరిశోధకులు

న్యూఢిల్లీ, జూలై 27: సుఖవంతమైన నిద్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనకు తెలుసు. కానీ మనలో చాలామందికి అతిగా నిద్రపోవడం వల్ల కూడా డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందని తెలియదు. హెచ్చు తగ్గుల నిద్రకు మన ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉంది. నిద్ర వ్యవధిని తరచూ మార్చుకునే వారికి డయాబెటిస్ బారిన పడే ప్రమాదం కూడా ఎక్కువగా ఉందని కొత్త పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఈ పరిశోధన ప్రకారం ప్రజలు తమ నిద్ర వ్యవధిని 31 నుంచి 45 నిమిషాల పాటు మార్చుకోవడం (నిద్ర వ్యవధి ఎక్కువ/తక్కువ చేయడం) వల్ల 15 శాతం డయాబెటిస్ రిస్క్ పెరుగుతుంది. ఇదే వ్యవధి గంటకు మించి ఉంటే ఆ ప్రమాదం 59 శాతం పెరుగుతుంది. యూకే బయోబ్యాంక్ ద్వారా పరిశోధకులు యాక్సిలో మీటర్లు ద్వారా 84 వేల మంది నిద్ర నమూనాలను వరుసగా ఏడు రాత్రుళ్లు పరిశీలించారు. అతి నిద్ర, నిద్ర లేమి రెండూ కూడా డయాబెటిస్‌కు దారితీసే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. నిద్రలేమి కారణంగా శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ బలహీనం కావడమే కాక, తీవ్ర రక్తపోటు, ఊబకాయం, మానసిక ఒత్తిడి, హృద్రోగ సంబంధ వ్యాధులు సోకే అవకాశాలు అధికంగా ఉంటాయని వెల్లడించిన గత పరిశోధనలను వీరు సమర్థిస్తూ అతి నిద్ర కారణంగా కూడా డయాబెటిస్ సోకే అవకాశాలు 34 శాతం అధికంగా ఉంటాయని తెలిపారు.

మంచి నిద్ర అలవాట్లు పాటించండి

చక్కటి ఆరోగ్యం కోసం తగిన సమయంలో, తగినంత నిద్రపోవాలని వారు తమ పరిశోధనలో తెలిపారు. నిద్రకు ముందు టీవీ, మొబైల్ చూడటం మానాలని వారు సూచిస్తున్నారు.

ఆలస్యంతో అడ్మిషన్లలో అనిశ్చితి

సీయూఈటీ-యూజీ ఫలితాలపై ఢిల్లీ వర్సిటీ ఫ్యాకల్టీ ఆగ్రహం

న్యూఢిల్లీ: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్-అండర్‌గ్రాడ్యుయేట్ (సీయూఈటీ-యూజీ) పరీక్షల ఫలితాలు ఆలస్యమవుతుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఈ విషయమై ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఎన్నికైన అకడమిక్ కౌన్సిల్ సభ్యులు మిథురాజ్ ధుసియా, మోనామీ బసు ఓ లేఖలో తమ అసంతృప్తిని విశ్వవిద్యాలయం ఉప కులపతి యోగేశ్ సింగ్‌కు తెలిపారు. సీయూఈటీ ఆధారంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ప్రక్రియలో ఫ్యాకల్టీ సభ్యుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాలను సమీక్షించాలని కోరారు. సీయూఈటీపై ఆధారపడటం వల్ల అడ్మిషన్ షెడ్యూలు, అకడమిక్ క్యాలెండర్లలో అనిశ్చితి వస్తున్నదని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రవేశ పరీక్ష నుంచి తప్పుకోవాలని కోరారు. మిడిమిడి జ్ఞానంతో, నాసిరకంగా రూపొందించిన జాతీయ విద్యా విధానం, సీయూఈటీ వంటి విధానాల వల్ల ఢిల్లీ విశ్వవిద్యాలయం స్వయంప్రతిపత్తిని కోల్పోతున్నదని ఆరోపించారు. మిథురాజ్ ఓ మీడియాతో మాట్లాడుతూ, సీయూఈటీ ఫలితాలు ఆలస్యమవుతుండటం వల్ల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు వెళ్లిపోతున్నారన్నారు. సీయూఈటీలో కూడా 99 శాతం, 100 శాతం మార్కులు సంపాదిస్తున్న విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, వారికి ప్రవేశాలు దొరకడం చాలా కష్టంగా ఉందని చెప్పారు. కటాఫ్ సిస్టమ్ వల్ల తరగతి గదుల్లో ప్రాంతీయ వైవిధ్యం తగ్గిపోతున్నదని చెప్పారు. దీనిపై వీసీ యోగేశ్ సింగ్ స్పందిస్తూ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు పని చేస్తామని చెప్పారు.

నాసాతో కలిసి రోదసికి గగన్‌యాన్ వ్యోమగామి

కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : గగన్‌యాన్ మిషన్ కోసం శిక్షణ పొందుతున్న నలుగురు వ్యోమగాములో ఒకరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వెళ్లబోతున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పార్లమెంటుకు చెప్పారు. నాసా గుర్తించిన ప్రైవేట్ సంస్థ ఏక్సియోమ్ స్పేస్‌తో ఇస్రో స్పేస్ ఫ్లైట్ అగ్రిమెంట్ చేసుకుందని చెప్పారు. దీని మేరకు గగన్‌యాన్ కోసం ఎంపికైన నలుగురు వ్యోమగాములు రష్యాలో స్పేస్‌ఫ్లైట్ బేసిక్ మాడ్యూల్‌పై శిక్షణ పొందారని ఆయన తెలియజేశారు

భారత సంతతి యువతకు బహిష్కరణ ముప్పు

- అమెరికాలో 2.50 లక్షల మంది 'ఏజింగ్ అవుట్'
- వీరిలో సగం మంది భారతీయ యువతీ యువకులే
- 21 ఏండ్లు వయస్సుతో ఇక 'డిపెండెంట్'లు కాదు
- గ్రీన్‌కార్డులు, ఇతర వీసాల కోసం ఎదురుచూపులు
- రాకపోతే అమెరికా నుంచి బయటకు వెళ్లాల్సిన స్థితి

న్యూఢిల్లీ, జూలై 27: వారంతా చిన్నతనంలో తల్లిదండ్రులతో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడే చదువుకున్నారు. కుటుంబం, స్నేహితులు, వృత్తి అంతా అక్కడే. కానీ, ఉన్నఫళంగా అన్నింటినీ వదిలేసి, దేశాన్ని విడిచి వారి సొంత దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అమెరికాలో దాదాపు 2.50 లక్షల మంది యువతీ యువకులు ఎదుర్కొంటున్న 'ఏజింగ్ అవుట్' ముప్పు సమస్య ఇది. వీరిలో భారత సంతతికి చెందిన వారే దాదాపు సగం మంది ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో వీరి భవిష్యత్తు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉంది.

21 ఏండ్లు రాగానే అమెరికాను వీడాల్సిందే

భారత్ సహా వేర్వేరు దేశాల నుంచి అమెరికాకు తాత్కాలిక వర్క్ వీసాల మీద వెళ్లిన వ్యక్తులు పిల్లలను కూడా తమతో తీసుకెళ్లవచ్చు. ఈ పిల్లలు తల్లిదండ్రులపై 'డిపెండెంట్(ఆధారపడినవారు)' హోదాతో అమెరికాలో ఉండేందుకు వీలు ఉంటుంది. అయితే, వీరికి 21 ఏండ్ల వయస్సు వచ్చినా, వివాహం జరిగినా డిపెండెంట్ హోదా కోల్పోతారు. అంతలోపు వారికి గ్రీన్ కార్డు, ఇతర వీసా ఏదైనా రాకపోతే వారు బలవంతంగా అమెరికా నుంచి వారి సొంత దేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ సమస్యనే 'ఏజింగ్ అవుట్' అంటారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనే యువతీ యువకులను 'డాక్యుమెంటెడ్ డ్రీమర్స్' అని పిలుస్తారు. అయితే, అమెరికాలో స్థిరపడటానికి ఇచ్చే గ్రీన్ కార్డుల జారీ చాలా అలస్యమవుతున్నది. ఏండ్ల తరబడి గ్రీన్ కార్డు కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం ప్రస్తుతం 12 లక్షల మంది ఈబీ-1, ఈబీ-2, ఈబీ-3 కేటగిరీల్లో గ్రీన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు

అమెరికాలో పెరిగి, చదువుకున్న యువత ఇలా దేశం నుంచి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతున్నది. వీరికి ఉపయోగపడేలా తీసుకువచ్చిన ఒక ఒప్పందాన్ని రెండుసార్లు రిపబ్లికన్లు ఆమోదం పొందకుండా అడ్డుపడ్డారని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరైన్ జీన్ పియెర్రీ ఆరోపించారు. 'ఏజింగ్ అవుట్' ముప్పును ఎదుర్కొంటున్న యువత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని 43 మంది చట్టసభ్యులు బైడెన్ ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భారత్ నుంచి చిన్నతనంలో వెళ్లి అమెరికాలో స్థిరపడ్డ ద్వారకేశ్ పటేల్ అనే ప్రముఖ పోడ్‌కాస్టర్ కూడా ఇటీవల ఈ ముప్పును ఎదుర్కొన్నారు. అదృష్టవశాత్తూ హెచ్-1బీ లాటరీలో వీసా దక్కడంతో అమెరికాలో ఉండగలిగానని, లేకపోతే భారత్‌కు తిరిగి వెళ్లాల్సి వచ్చేదని ద్వారకేశ్ తన అనుభవాన్ని పంచుకున్నారు. ఇలాంటి పరిస్థితినే వేలాది మంది భారతీయ యువతీ యువకులు ఎదుర్కొంటున్నారు.

తొమ్మిది రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

న్యూఢిల్లీ, జూలై 27: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తొమ్మిది రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు శనివారం తెలిపాయి. హరిబౌ కిషన్‌రావు బాగ్డే రాజస్థాన్‌గా గవర్నర్‌గా, జిష్ణు దేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా, ఓమ్ ప్రకాశ్ మాథుర్ సిక్కిం గవర్నర్‌గా, సంతోష్ కుమార్ గంగ్వార్ జార్ఖండ్ గవర్నర్‌గా, రామెన్ దేకా ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా, సీహెచ్ విజయ్ శంకర్ మేఘాలయా గవర్నగా నియమితులైనట్లు సమాచారం. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా, అస్సాం గవర్నర్‌గా ఉన్న గులాబ్ చంద్ కటారియా పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమితులయ్యారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్న లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య అస్సాం గవర్నర్‌గా నియమితులయ్యారు. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు మణిపూర్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేకంగా ప్యాకేజీలు!

మళ్లీ తెచ్చేందుకు ట్రాయ్ అభిప్రాయాల సేకరణ

న్యూఢిల్లీ: గతంలో మొబైల్ ఫోన్‌లలో వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక ప్యాకేజీలుండేవి. వీటిని మళ్లీ తీసుకొచ్చేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన కీలక పత్రాన్ని ట్రాయ్ సిద్ధం చేసింది. దీనిలో పేర్కొన్న విషయంపై పరిశ్రమ వర్గాలు, మొబైల్ ఫోన్ వినియోగదార్ల నుంచి అభిప్రాయాల్ని సేకరించబోతున్నది. ఆగస్టు 16 నుంచి రాతపూర్వకంగా అభిప్రాయ సేకరణ ఉంటుందని ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికాం కంపెనీలు ప్రస్తుతం ఆఫర్ చేస్తున్న ప్యాకేజీల్లో..వాయిస్ కాల్స్, డాటాను మాత్రమే వినియోగదారులు ఉపయోగిస్తున్నారు. ప్యాకేజీలో..ఎస్ఎంఎస్, వాయిస్ మెస్సేజ్..అన్న వాటిని ఉపయోగించుకోకున్నా.. వాటిని వినియోగదారులకు టెలికాం కంపెనీలు బలవంతంగా అంటగడుతున్నాయన్న ఆరోపణ ఉంది.

సీఎస్ఐఆర్-నెట్ పరీక్షలో అక్రమాలు

మీరట్, జూలై 27: సీఎస్ఐఆర్-నెట్ పరీక్షలో అక్రమాలకు పాల్పడిన నలుగురు అభ్యర్థులతో పాటు వారికి సహకరించిన మరో ముగ్గురిని యూపీలోని మీరట్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసింది. జూలై 25 నుంచి 27 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్ష జరిగింది. మీరట్‌లోని సుభార్తి విశ్వవిద్యాలయంలోని పరీక్ష కేంద్రంలో ఐటీ మేనేజర్ అరుణ్ శర్మ, ల్యాబ్ అసిస్టెంట్ వినీత్ కుమార్.. హర్యానాకు చెందిన నలుగురు అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకొని పరీక్షలో అక్రమాలకు సహకరించారు.

చెల్లిపై బాలుడి లైంగిక దాడి

ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూసి దారుణం

భోపాల్: ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూసి చెల్లిపై లైంగిక దాడికి పాల్పడి, ఆ చిన్నారిని తల్లితో కలిసి హతమార్చాడు ఓ బాలుడు. మూడు నెలల క్రితం మధ్య ప్రదేశ్‌లోని రేవా జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదనపు ఎస్పీ వివేక్ లాల్ కథనం ప్రకారం.. పెరట్లో నిద్రిస్తుండగా ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూసిన బాలుడు.. చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి, గొంతు నులిమా డు. ఈ విషయాన్ని తల్లికి చెప్పగా ఆమె వచ్చి చూసేటప్పటికి బాలిక ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నది. దీంతో తల్లే కన్నకూతురి గొంతు నులిమి ప్రాణం తీసింది. విషపురుగు కరిచి బాలిక చనిపోయిందని తల్లి నాటక మాడింది. పోలీసుల విచారణలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.

298 కోట్ల చెట్టినాడ్ గ్రూప్ కంపెనీ ఆస్తులు స్వాధీనం

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా చెన్నైకి చెందిన 'చెట్టినాడ్ గ్రూప్'లోని ఓ కంపెనీకి చెందిన రూ.298 కోట్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ శనివారం ప్రకటించింది. తమిళనాడు జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, సౌత్ ఇండియా కార్పొరేషన్ లిమిటెడ్‌పై (చెట్టినాడ్ గ్రూప్) పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీ కేసు నమోదైంది. తమిళనాడు జనరేషన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థకు చెట్టినాడ్ గ్రూప్ కంపెనీ వల్ల రూ.908 కోట్లు నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి.

మైక్ కట్ చేశారని మమత వాకౌట్

- నీతి ఆయోగ్ సమావేశంలో అవమానించారని ఆరోపణ
- కేవలం ఐదు నిముషాలే సమయమిచ్చారని ఆగ్రహం

న్యూఢిల్లీ, కోల్‌కతా, జూలై 27: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శనివారం న్యూఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశం నుంచి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వాకౌట్ చేశారు. సమావేశం నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను మాట్లాడటం ప్రారంభించిన ఐదు నిముషాల తర్వాత తన మైక్రోఫోన్‌ను ఆపేశారని, అదే సమయంలో మిగతా సీఎంలు చాలాసేపు ప్రసంగించడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. 'ఇది చాలా అవమానకరం. ఇక ముందు జరిగే సమావేశాలకు హాజరు కాబోను' అని ఆమె స్పష్టం చేశారు.

టైమ్ అయిపోయినట్టు చూపించిందంతే

మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొట్టిపడేశారు. 'ఆమె మైక్‌ను నిలిపివేశారనడం పూర్తి అబద్ధం. ఆమె తనకు కేటాయించిన పూర్తి సమయాన్ని వినియోగించుకున్నారు.' అని ఆమె అన్నారు. కాగా, మైక్ కట్ చేయలేదని, సమయం ముగిసినట్టు మాత్రమే గడియారం చూపిందని అధికారులు తెలిపారు. మమతకు జరిగిన అవమానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందిస్తూ విపక్ష పార్టీల పట్ల కేంద్రం శత్రువుల్లా వ్యవహరించరాదని అన్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్: మోదీ

అభివృద్ధి చెందిన దేశంగా 2047 నాటికి భారత్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంపై ఈ సమావేశం దృష్టి సారించినట్టు ప్రధాని మోదీ చెప్పారు. 'వికాస్ భారత్@2047 ప్రతి భారతీయుడి లక్ష్యం. ప్రజలతో నేరుగా అనుసంధానమై ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రాలు క్రియాశీలక పాత్ర పోషించాలి' అని అన్నారు.

నితీశ్, విపక్ష పార్టీల సీఎంల గైర్హాజరు

నీతి ఆయోగ్ సమావేశానికి బీహార్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పంజాబ్, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు హాజరు కాలేదు.

అధ్యక్ష బరిలో నిలుస్తున్నా!

తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన కమలా హారిస్

వాషింగ్టన్, జూలై 27: ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ పార్టీ నేత కమలా హారిస్ అధికారికంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలపై శనివారం ఆమె సంతకాలు చేశారు. ఈ మేరకు కమలా హారిస్ ఎక్స్ పోస్టులో వెల్లడించారు. అయితే డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థిగా ఆమె పేరును పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది. ప్రతి ఒక్కరి ఓటు పొందేందుకు కృషి చేస్తానని, అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌పై తప్పకుండా విజయం సాధిస్తానని కమలా హారిస్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ఇతర డెమొక్రాట్లు ఎవరూ ప్రకటించలేదు.

హోంమంత్రిగా షా ఓ విచిత్రం!

అమిత్ షా వ్యాఖ్యలకు శరద్ పవార్ కౌంటర్

ముంబై, జూలై 27: బహిష్కరణకు గురైన అమిత్ షా ఇవాళ దేశానికి హోంమంత్రి కావడం విచిత్రమని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ విమర్శించారు. ఇటీవల రాష్ట్ర బీజేపీ నేతల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలోని అవినీతి రాజకీయ నాయకులకు శరద్ పవార్ ముఠా నాయకుడని విమర్శించారు. ప్రభుత్వంలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన రాజకీయ నేత శరద్ పవార్ మాత్రమేనని ఆరోపించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో అమిత్ షాకు కౌంటర్‌గా శరద్ పవార్ ప్రత్యారోపణలు చేశారు. శుక్రవారం ఆయన ఎన్సీపీ నేతల సమావేశంలో మాట్లాడుతూ.. 'గుజరాత్‌లో చట్టాన్ని దుర్వినియోగం చేసి, సుప్రీంకోర్టు ద్వారా బహిష్కరణకు గురైన వ్యక్తి ఇవాళ దేశానికి హోంమంత్రి కావడం విచిత్రం. కాబట్టి, మనం ఎటు వెళ్తున్నామో ఆలోచించాలి. లేకపోతే దేశం 100 శాతం తప్పు దారిలోకి వెళ్తుంది. దీనిపై మనం దృష్టి సారించాలి.' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో 2010లో అమిత్ షా రెండేండ్ల రాష్ట్ర బహిష్కరణకు గురయ్యారు. ఈ కేసులో 2014లో ఆయన నిర్దోషిగా తీర్పు వచ్చింది.

విపక్షంగా కర్ణాటక బీజేపీ విఫలం

సొంత పార్టీపై మాజీ మంత్రి అరవింద్ లింబావళి విమర్శలు

బెంగళూరు, జూలై 27: సొంత పార్టీపై కర్ణాటకకు చెందిన బీజేపీ నేత, మాజీ మంత్రి అరవింద్ లింబావళి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా బీజేపీ పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్ అశోక మధ్యలో సఖ్యత, అవగాహన లేకపోవడం విచారకరమని అన్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ముడా కుంభకోణం, వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్, ఎస్సీ, ఎస్టీ నిధుల దుర్వినియోగం వంటి అంశాలను మా పార్టీ నేతలు సమర్థవంతంగా ప్రస్తావించడంలో విఫలమయ్యారు. బీజేపీ అధికార కాంగ్రెస్‌తో కుమ్మక్కు అయిందా? అని ప్రజలు చర్చించుకొంటున్నారు' అని ఆయన అన్నారు.

అమర్‌నాథ్ యాత్రపై ఐఎస్ఐ కుట్ర!

న్యూఢిల్లీ: అమర్‌నాథ్ యాత్రలో విధ్వంసం సృష్టించేందుకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఐఎస్ఐ ఖలిస్థానీ ఉగ్ర సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో కలిసి అమర్‌నాథ్ యాత్రపై కుట్రకు ప్లాన్ చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భక్తులను లక్ష్యంగా చేసుకొని అమర్‌నాథ్ యాత్రలో విధ్వంసం చేసేందుకు ఐఎస్ఐ కుట్రలు చేస్తున్నదని, పెద్ద యెత్తున దాడులు చేసేందుకు పంజాబ్‌లోని గ్యాంగ్‌స్టర్లు, తీవ్ర వాద గ్రూపులు, ఉగ్ర సంస్థల సహకారం తీసుకొన్నట్టు తెలిసింది.

టైటానియంతో కృత్రిమ గుండె



న్యూయార్క్: గుండె విఫలమయ్యే ముప్పు ఎదుర్కొంటున్న వారి ప్రాణాలను కాపాడే కృత్రిమ గుండెను అమెరికాకు చెందిన బైవాకోర్ కంపెనీ తయారు చేసింది. బైవెంట్రిక్యులర్, యూని వెంట్రిక్యులర్ హార్ట్ ఫెయిల్యూర్ ముప్పు ఉన్న వారి గుండెపై భారాన్ని తగ్గించేందుకు, గుండె చేసే పనికి సహాయకంగా ఈ కృత్రిమ గుండెను ఉపయోగిస్తారు. టెక్సాస్ మెడికల్ సెంటర్‌లో ఒక వ్యక్తికి ఈ కృత్రిమ గుండెను అమర్చినట్టు టెక్సాస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్. బైవాకోర్ శుక్రవారం ప్రకటించాయి. టైటానియంతో ఈ కృత్రిమ గుండెను తయారు చేశారు. ఈ కృత్రిమ గుండె పూర్తిగా అసలైన గుండె స్థానంలో అమర్చడానికి ఉపయోగపడదు. గుండె విఫలమయ్యే ముప్పున్న వారికి వేరొకరి గుండెను అమర్చే వరకు సహాయకారిగా పని చేస్తుంది.

మధుమేహులకు వాల్‌నట్స్ మంచివి కావు!

న్యూఢిల్లీ: వాల్‌నట్స్ అత్యంత ఆరోగ్యకరమైనవి. న్యూట్రియెంట్లు వీటిలో పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్లు, మినరల్స్‌ను అందిస్తాయి. అయితే, నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుమేహం ఉన్నవారికి వాల్‌నట్స్ అంత శ్రేయస్కరం కాదు. వాల్‌నట్స్‌లో ఆక్సలేట్స్ అత్యధికంగా ఉంటాయి. ఇవి కాల్షియం ఆక్సలేట్ రూపొందడానికి దోహదపడతాయి. మూత్రపిండాల రాళ్లలో సామాన్యంగా కనిపించేది కాల్షియం ఆక్సలేట్. మధుమేహం ఉన్నవారిలో ఎసిడిక్ యూరిన్ ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్ల వృద్ధి చెందే ముప్పును పెంచుతుంది. మూత్రంలోని కాల్షియం ఆక్సలేట్ పేరుకుపోయి, గడ్డ కట్టడం వల్ల రాళ్లు ఏర్పడతాయి.

క్యాన్సర్‌ను తుదముట్టించే నోటి బ్యాక్టీరియా!



న్యూఢిల్లీ, జూలై 27: తల, మెడ భాగంలో వచ్చే క్యాన్సర్ కణతులను (శరీరం లోపల, బయట ఏర్పడుతుంటాయి) నోటిలో ఉండే మంచి బ్యాక్టీరియా తుదముట్టిస్తుందన్న సంగతి తాజా అధ్యయనంలో తేలింది. 'పూసోబ్యాక్టీరియం' అనేది 99 శాతం క్యాన్సర్ కణాల్ని అంతమొందిస్తుందని, క్యాన్సర్ చికిత్సలో కీలక భూమిక వహిస్తుందని సైంటిస్టులు తేల్చారు. 'జర్నల్ క్యాన్సర్ కమ్యూనికేషన్స్' కథనం. 155 మంది రోగుల డాటాను తీసుకొని వివిధ రకాలుగా ప్రయోగాలు జరిపారు. నోట్లో ఫూసోబ్యాక్టీరియా ఉన్న రోగుల్లో క్యాన్సర్ 65 శాతం తగ్గదల కనిపించింది. ప్రయోగశాలలో క్యాన్సర్ కణాలపై బ్యాక్టీరియాను ప్రయోగించగా, కొన్ని రోజుల తర్వాత క్యాన్సర్ కణాల్లో 70 నుంచి 99 శాతం వరకు తగ్గదల కనపడింది.

ఒకే కంపెనీలో 84 ఏండ్లు ఉద్యోగం

న్యూఢిల్లీ : ఈ రోజుల్లో డబ్బు, కెరీర్ అవకాశాల పేరుతో ఉద్యోగులు అనేక కంపెనీలకు మారుతున్నారు. కానీ బ్రెజిల్‌కు చెందిన వాల్టర్ ఆర్థ్‌మ్యాన్ (100) ఒకే కంపెనీలో 84 ఏండ్లు పని చేసి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఆయన ఇండస్ట్రియాస్ రెనోక్స్ కంపెనీలో 1938 జనవరి 17న ఉద్యోగంలో చేరారు. ఆయన అదే కంపెనీలో సేల్స్‌మ్యాన్‌గా, సేల్స్ మేన